సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 27 । మే । 2025



మావోయిస్టుల మృతదేహాలను అప్పగించాలి 8లో



సింహాచలం ఈవోగా విధుల్లో చేరిన త్రినాథరావు 8లో



విమ్స్‌లో 29న వాక్-ఇన్ ఇంటర్వ్యూ 8లో

ఈ నెల 12న అర్జీ సమర్పించినా..

పెందుర్తి మండలం, చింతగంట్ల గ్రామంలో సర్వేనంబర్ 57/2లో 200 గజాల స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతి కోరుతూ జెర్రిపోతుల గ్రామానికి చెందిన చీపురుపల్లి నర్సింగరావు జిల్లా కలెక్టర్‌కు ఈ నెల 12న అర్జీ సమర్పించారు. ఈ అంశంపై గతంలోనే పెందుర్తి మండల రెవెన్యూ అధికారిని జిల్లా కలెక్టర్ వివరణ కోరారు. అయితే సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం మళ్లీ అర్జీ సమర్పించేందుకు బాధితుడు వచ్చాడు. దీంతో కలెక్టర్ స్పందించి తక్షణం సమస్యను పరిష్కరించాలని పెందుర్తి తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌ను ఆదేశించారు.

15సార్లు ఫిర్యాదు చేశా..



నేను కోట వీధిలో నివసిస్తున్నాను. ఇంటి కోసం నేను ఇప్పటికి 15 సార్లు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో దరఖాస్తు చేశా. భర్తతో విడాకులు అయ్యాయి. ఇద్దరు పిల్లలతో ఏదో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తున్నాను. నాకు అనకాపల్లి, ఎన్.ఎస్.పురం వద్ద టిడ్కో ఇల్లు మంజూరైంది. దీనికి సంబంధించిన డబ్బులు కూడా కట్టాను, ఈకేవైసీ చేశారు, జియోట్యాగింగ్ కూడా పూర్తయ్యింది. అయితే ఇప్పుడు జాబితాలో నా పేరు లేదు. పేరును ఎందుకు తొలగించారని పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు చేశా.. ఎలాంటి సమాధానం రాలేదు. అసలు ఏం జరిగిందో నాకు తెలియడం లేదు. నా లాంటి మహిళలకు ఎందుకు అన్యాయం చేస్తున్నారు? దయచేసి నాకు ఇల్లు ఇప్పించండి.

–షేక్ రహీమ్ తున్నీ, కోటవీధి

సమస్య పరిష్కారం కాలేదు

ఆనందపురం మండలం, మామిడిలోవ గ్రామంలోని సర్వేనెంబర్ 85/5లో గవర గీత పేరున తప్పుడు డాక్యుమెంట్లతో జరిగిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ వచ్చిన దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కరించాల్సిందిగా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రను సోమవారం ఆదేశించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. బాధితురాలు గీత ఈ నెల 12వ తేదీన జరిగిన పీజీఆర్ఎస్‌లో అర్జీ సమర్పించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం మళ్లీ అర్జీ సమర్పించేందుకు రాగా...కలెక్టర్ పై విధంగా స్పందించారు.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేయాలి



జీవీఎంసీ జోన్-2 పరిధిలోని మధురవాడలో ప్రభుత్వ పార్కు స్థలాలు కబ్జాకు గురై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏడవ వార్డు బొట్టవానిపాలెం ఈడబ్ల్యూఎస్ లేఅవుట్, స్వతంత్ర నగర్‌లో సుమారు మూడు కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన జీవీఎంసీ పార్కులో 150 గజాల స్థలాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆలయం పేరుతో కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీనిపై ఈ నెల 5న జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఈ నెల 19న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించగా, సమస్య పరిష్కారమైనట్లు మెసేజ్ వచ్చింది. కానీ వాస్తవంగా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. అదే విధంగా, ఏడో వార్డులోని కళానగర్, కృష్ణ నగర్ పార్కులు, స్వతంత్ర నగర్‌లోని బ్రహ్మంగారి గుడి ఎదురుగా ఉన్న మరో జీవీఎంసీ పార్కు స్థలాలు కూడా కబ్జాకు గురై, అనధికారికంగా కరెంటు మీటర్లు కూడా ఏర్పాటు చేశారు. జోనల్ కమిషనర్ ఆక్రమణదారులకు మద్దతు పలుకుతున్నారు. కబ్జాలను అరికట్టి, ప్రభుత్వ పార్కు స్థలాలను కాపాడాలి.

–రజిని, సామాజిక కార్యకర్త

అంతాభ్రాంతియేనా...



అర్జీల గతి ఇంతేనా...!

- అర్జీ సమర్పించినా పరిష్కారం కాని సమస్యలు
- పరిష్కారం కాకుండానే పరిష్కరించినట్టు మెసేజ్‌లు
- కాళ్లరిగేలా తిరుగుతున్న అర్జీదారులు
- ప్రజలతో కూటమి ప్రభుత్వం ఆటలు
- పీజీఆర్ఎస్ అంతా డిజిటల్ మాయ అంటూ బాధితుల గగ్గోలు

పీజీఆర్ఎస్: 'పరిష్కారం' అనే భ్రమ

కలెక్టరేట్ మెట్లు : సమస్యల 'తిరుగు ప్రయాణం' మొదలయ్యే చోటు

అర్జీ..: 'క్లోజ్డ్' అని కనిపించినా, సమస్య మాత్రం 'ఓపెన్'లోనే..

ఆహా! ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) అద్భుతాలు ఇవి.. ప్రతి సోమవారం కలెక్టరేట్ మెట్లు ఎక్కే భాగ్యం సామాన్య ప్రజలకు కల్పిస్తూ, వారి సమస్యలకు 'శాశ్వత పరిష్కారం' చూపే అద్భుతమైన వేదిక ఇది. వినతులు ఇచ్చి, అవి పరిష్కారం కాకుండానే 'పరిష్కారమైపోయినట్లు' రికార్డుల్లో చూసి, కంగుతిని మళ్లీ మళ్లీ కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేసే అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి హ్యాట్సాఫ్!. పీజీఆర్ఎస్ ఓ అంతులేని ప్రహసనం.. ప్రతి సోమవారం కలెక్టరేట్ గేటు దగ్గర ఒక పండగ వాతావరణం. జన సందోహం, ఆశలు చిగురించిన మొహాలు. పీజీఆర్ఎస్‌కు వచ్చామంటే సమస్య తీరినట్లే అనే భరోసా. కానీ లోపల జరిగే తతంగం మాత్రం వేరు. ఫిర్యాదు ఇచ్చామా, అది ఓపెన్ అయ్యిందా, అధికారులు చూశారా అనే కన్నా, 'పరిష్కారమైపోయింది' అని స్టేటస్ మారడం ముఖ్యమని అధికార యంత్రాంగం నిరూపిస్తోంది. సమస్య అలాగే ఉన్నా, కాగితాలపై మాత్రం క్లోజ్ ! ఇది కదా అసలైన 'డిజిటల్ ఇండియా' అంటే!..'గత సోమవారం ఇదే సమస్య ఇచ్చానండి, పరిష్కారం కాలేదు. మళ్లీ వచ్చాను' అని చెప్పే నిస్సహాయుల మాటలు కలెక్టరేట్ గోడలు కూడా వింటున్నాయి. అయినా అధికారులకు మాత్రం వినిపించవు. ఎందుకంటే, వారికి కనిపించేది స్క్రీన్ మీద 'క్లోజ్డ్' అని. సమస్య తీరకపోయినా, అది తీరినట్లు నమోదు చేయడం అనేది ఒక వినూత్నమైన ఆవిష్కరణ. దీని వల్ల ప్రజల ఆత్మస్థైర్యం పెరుగుతుందేమో ! మళ్లీ మళ్లీ పోరాడాలనే స్ఫూర్తి వస్తుందేమో!.. సమస్య పరిష్కారం కాలేదని తెలిసి లబోదిబోమంటూ, 'నా సమస్య ఎలా పరిష్కారం అయినట్లు?' అని అడిగే ఫిర్యాదుదారులను చూస్తే, అధికారులు ఆశ్చర్యపోతారు. బహుశా వారికి తెలియదేమో, కాగితాలపై పరిష్కారం అయితే, నిజంగానే సమస్య తీరిపోతుందని! ఈ 'షాక్ థెరపీ'తోనైనా ప్రజలు తమ సమస్యల గురించి ఆలోచించడం మానేస్తారేమో..! ఏదేమైనా, పీజీఆర్ఎస్ అనేది నిరంతరాయంగా కొనసాగే ఓ ప్రహసనం. ప్రజల ఓర్పుకు, అధికారుల 'సామర్థ్యానికి' అద్దం పడుతోంది. మళ్లీ వచ్చే సోమవారం కొత్త ఆశలతో, పాత సమస్యలతో ఎంతమంది కలెక్టరేట్ మెట్లెక్కుతారో చూడాలి.

–మహారాణిపేట



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

పీజీఆర్ఎస్‌కు 237 వినతులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 237 వినతులు అందాయి. రెవెన్యూ శాఖకు చెందినవి 94 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 21, జీవీఎంసీకి సంబంధించి 64 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు 58 వినతులు వచ్చాయి.

కలెక్టర్ సమీక్ష

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో కలెక్టర్ హరేందిర ప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, ల్యాండ్ సర్వే, అటవీ, పోలీస్, జీవీఎంసీలకు సంబంధించి ఎక్కువగా అర్జీలు వస్తున్నాయన్నారు. రీ ఆర్జీలు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అర్జీదారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడారు. జేసీ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ పాల్గొన్నారు.

ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి



కేజీహెచ్‌లో ఏఎన్ఎంగా ఉద్యోగం కోల్పోయానని, తనకు న్యాయం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌ను దివ్యాంగురాలు నాగమణి వేడుకున్నారు. దివ్యాంగురాలిని కావడంతో ఉద్యోగం ఎవరూ ఇవ్వడం లేదని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. ఏపీ పారామెడికల్ బోర్డు ద్వారా శిక్షణ పొంది, ఏఎన్ఎం పోస్టుకు తాను అర్హురాలినని నాగమణి తెలిపారు. కేజీహెచ్‌లో పనిచేసిన తనను నిధులు లేవని తొలగించారని వివరించారు. తన భర్త అనారోగ్యంతో మంచంపై ఉన్నారని, ఇద్దరు పిల్లలతో తన జీవితం భారంగా సాగుతోందని చెప్పారు. ప్రస్తుతం పింఛనుతోనే కుటుంబాన్ని పోషిస్తున్నానని, గతంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో దరఖాస్తు చేసినా స్పందన లేదని, ఇప్పుడు మళ్లీ దరఖాస్తు చేసుకున్నానని తెలిపారు.

పార్టీ కోసం కష్టపడేవారికే కమిటీల్లో చోటు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ మండల, వార్డు కమిటీల్లో అవకాశం కల్పిస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. సోమవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో మండల, వార్డు కమిటీలపై పార్టీ సీనియర్ నాయకులు, వార్డు అధ్యక్షులతో ఆయన సమావేశమయ్యారు. వార్డుల వారీగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే యువతకు అవకాశం కల్పించేలా వారి నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. విశాఖ ఉత్తర, దక్షిణ, విశాఖ పశ్చిమ, విశాఖ తూర్పు, గాజువాక నియోజకవర్గాల నుంచి పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. నియోజకవర్గాల్లోని వార్డుల వారీగా ప్రతి ఒక్కరితో మాట్లాడి, పార్టీ కోసం పనిచేసి కూడా ఇప్పటివరకు పదవులు రాని కార్యకర్తల పేర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో పార్టీ కమిటీల నిర్మాణంపై చర్చించారు. కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవిరెడ్డి, కార్పొరేటర్లు, పార్టీ నేతలు స్వాతి దాస్, పేడాడ రమణికుమారి, పీలా వెంకటలక్ష్మి, సీహెచ్ లావణ్య, నీలి రవి, బి. పద్మావతి, మంచ నాగ మల్లేశ్వరి, జీలకర్ర నాగేంద్ర, గుండుపల్లి సతీష్, భీశెట్టి ప్రసాద్, చొక్కర శేఖర్, వరలక్ష్మి, రాఘవులు, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కేకే రాజు

వీఎంఆర్‌డీఏ ప్రాంగణాల్లో పనులు వేగవంతం

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణం, గురజాడ కళాక్షేత్రంలో జరుగుతున్న మరమ్మతులు, నిర్వహణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయన ఆయా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే, నిర్వహణ గుత్తేదారుడికి పలు మార్పులు, చేర్పులు చేయాల్సిందిగా సూచించారు. ఈ పర్యటనలో కమిషనర్‌తో పాటు కార్యదర్శి మురళీకృష్ణ, ఎస్ఈ భవానీశంకర్, ఈఈలు రామరాజు, దుర్గా ప్రసాద్, పరిపాలనాధికారి హేమంత్, సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్

రయ్.. రయ్..

- మాస్టర్‌ప్లాన్ రహదారుల అభివృద్ధికి టెండర్లు
- రూ.154.60 కోట్లతో ఏడు రహదారుల విస్తరణ, నిర్మాణం
- ఏడాదిలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు



విశాఖ సిటీ: విశాఖ నగరంలో కొత్త రహదారుల అభివృద్ధికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూపొందించిన మాస్టర్‌ప్లాన్ రోడ్ల నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. రూ.154.60 కోట్ల అంచనా వ్యయంతో ఏడు ప్రాంతాల్లో 26.77 కిలోమీటర్ల మేర కొత్త రహదారుల అభివృద్ధి, విస్తరణ పనులకు విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. ఏడాదిలో ఈ రోడ్లను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రణాళికలు

భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభమైతే ఆ రహదారిలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్‌లో కొత్త రహదారుల అభివృద్ధికి చోటు కల్పించారు. అలాగే, ప్రస్తుతమున్న రోడ్ల విస్తరణ చేపట్టేందుకు ఆమోద ముద్ర వేశారు. ఇందులో భాగంగా 15 రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయగా, వాటిలో 8 రోడ్ల విస్తరణతో పాటు ఏడు రహదారులను కొత్తగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ 15 రహదారుల నిర్మాణాల్లో కొన్నింటిని జీవీఎంసీ, ఆర్అండ్‌బీ చేపట్టనున్నాయి. వీఎంఆర్‌డీఏ ఏడు రోడ్ల అభివృద్ధికి టెండర్ల ప్రక్రియను చేపట్టింది.

ప్రాంతం	కి.మీ.	వ్యయం(రూ.కోట్లలో)
దివీస్ రోడ్ (చిప్పాడ)	6.45	36.93
నేరెళ్లవలస	3.90	19.74
బోయపాలెం రోడ్	3.10	8.92
గంభీరం రోడ్-1	1.46	5.69
గంభీరం రోడ్-2	2.18	14.73
శివశక్తినగర్ రోడ్	1.67	7.77
అడవివరం శొంఠ్యాం రోడ్	8.03	60.82
మొత్తం	26.77	రూ.154.60 కోట్లు

ఏడాదిలో పూర్తికి కసరత్తు

ఈ మాస్టర్‌ప్లాన్ రహదారుల్లో భాగంగా చిప్పాడ–పోలిపల్లి (దివీస్ రోడ్డు), నేరెళ్లవలస–తాళ్లవలస, బోయపాలెం–మంగమారిపేట, పరదేశిపాలెం–గంభీరం, గంభీరం–గంభీరం హైవే, శివశక్తినగర్–హరిత ప్రాజెక్ట్స్, అడవివరం జంక్షన్–గండిగుండం రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. భోగాపురం విమానాశ్రయం పూర్తయ్యే సమయానికి వీటిని సిద్ధం చేయాలన్న లక్ష్యంతో అధికారులు కసరత్తు చేస్తున్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విశాఖ నుంచి ఎయిర్‌పోర్టుకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా సునాయాసంగా రాకపోకలు సాగించడానికి అనువుగా ప్రత్యామ్నాయ రోడ్లను తీర్చిదిద్దనున్నారు. వీటితో పాటు జీవీఎంసీ, ఆర్అండ్‌బీ కూడా ఇతర రహదారుల నిర్మాణాలకు సమాయత్తమవుతున్నాయి.

కొత్త రేషన్ కార్డుల జారీకి దరఖాస్తుల స్వీకరణ: జేసీ

మహారాణిపేట: జిల్లాలో కొత్త రేషన్ కార్డుల జారీ కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతోందని, అర్హులైన ప్రజలు గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కోరారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు, రేషన్ కార్డుల విభజన, కొత్త సభ్యుల చేరిక, తప్పుగా నమోదైన ఆధార్ నంబర్ సవరణ, చిరునామా మార్పులు, ఇతర వివరాల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు, వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపు, కార్డులు సరెండర్ చేయడం వంటి ఆరు రకాల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. అనాథాశ్రమాల్లో ఉండే వృద్ధులు కూడా రేషన్ కార్డులు లేకపోతే దరఖాస్తు చేసుకోవచ్చని జేసీ మయూర్ అశోక్ స్పష్టం చేశారు. మొత్తం ప్రక్రియ పూర్తయిన తర్వాత జూన్ నెలలో క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారుల చిరునామాకు పంపడం జరుగుతుందని ఆయన వివరించారు.

డింపుల్ హిరణ్యకు 'మిస్ టీన్ సూపర్ మోడల్ 2025' రన్నరప్ టైటిల్



బీచ్‌రోడ్డు: నగరానికి చెందిన 14 ఏళ్ల డింపుల్ హిరణ్య ఇండియా మిస్ టీన్ సూపర్ మోడల్ 2025 పోటీల్లో రన్నరప్‌గా నిలిచింది. గోవాలో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో ఆమె రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ విజయంతో డింపుల్, ఈ పోటీల విజేతతో పాటు ఆగస్టులో వియత్నాంలో జరగబోయే ప్రపంచ మిస్ టీన్ సూపర్ మోడల్ పోటీల్లో భారతదేశం తరఫున పాల్గొననుంది. ఈ సందర్భంగా డింపుల్‌కు పలువురు అభినందనలు తెలిపారు.



చిత్రకళకు మురి'షీ'.. రంగులు, బ్రష్‌లతో ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల మాయ చేశారు. కళాకారులు వేసిన చిత్రాలు వావ్ అనిపించాయి. మహిళల మనసు దోచాయి.. చూసిన వారందరినీ అబ్బురపరిచాయి. 8లో



అలలు ఎగసి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో విశాఖ కోస్టల్ బ్యాటరీ తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. -ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

చిత్రకళా..భళా.!

ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఎగ్జిబిషన్

జూన్ 1 వరకు కొనసాగనున్న ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు







విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో స్పెక్ట్రం పేరుతో బీఎఫ్ఏ, ఎంఎఫ్ఏ విద్యార్థులు వార్షిక చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను సోమవారం ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభతో ఉన్నతంగా రాణించాలన్నారు. శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న ఆంధ్ర విశ్వ కళాపరిషత్‌లో ఉన్నత విద్యను అభ్యసించడం గర్వకారణమని చెప్పారు. విద్యార్థులు సృజనాత్మకత, నైపుణ్యాలతో అద్భుతమైన కళాఖండాలను తీర్చిదిద్ది ప్రదర్శించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విభాగాధిపతి డి.సింహాచలం మాట్లాడుతూ జూన్ 1వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. విభాగ ఆచార్యులు శిష్టా శ్రీనివాస్, విశ్రాంత ఆచార్యులు వి.రమేష్, ఎం.ఆదినారాయణ, టి.సుధాకర్ రెడ్డి, బి.మహేశ్వర దాస్, మయూఖ కుమారి దేవి తదితరులు చిత్రకళా ప్రదర్శనను సందర్శించి విద్యార్థులను అభినందించారు.



ఎన్‌సీసీ క్యాడెట్ల విజ్ఞాన యాత్ర

నగరంలోని విశాఖ మ్యూజియంలో సోమవారం ఎన్‌సీసీ క్యాడెట్లు సందడి చేశారు. ఆర్మీ క్యాంపులో భాగంగా పలు కళాశాలలకు చెందిన క్యాడెట్లు మ్యూజియంను సందర్శించి.. అక్కడ ప్రదర్శనకు ఉంచిన వివిధ రకాల ఆయుధాల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. మ్యూజియం సిబ్బంది ఆయా ఆయుధాల చరిత్ర, ప్రాముఖ్యతను వారికి వివరించారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

విమ్స్‌లో 29న వాక్-ఇన్ ఇంటర్వ్యూ

28 వైద్య పోస్టుల భర్తీ

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో వైద్య పోస్టుల భర్తీ కోసం ఈ నెల 29న వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీలో భాగంగా అభ్యర్థులకు ఎలాంటి రాత పరీక్ష ఉండదు. కేవలం అభ్యర్థుల ఉత్తీర్ణత శాతం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా భర్తీ చేస్తారు. ప్రస్తుతం విమ్స్‌లో వివిధ విభాగాల్లో 28 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 29న ఉదయం 10 గంటల నుంచి విమ్స్‌లో జరిగే వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని డైరెక్టర్ రాంబాబు కోరారు. ఉత్తీర్ణత పత్రాలు, మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ కార్డు తీసుకురావాలి. స్పెషాలిటీ వైద్యులకు నెలకు రూ.92 వేలు, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు నెలకు రూ.1.60 లక్షలు వేతనంగా చెల్లిస్తారు. అనస్థీషియా విభాగంలో 10 ఉద్యోగాలు, న్యూరో సర్జరీలో 3, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ (మెడికల్) 3, కార్డియాలజీలో 2, ఎమర్జెన్సీ మెడిసిన్‌లో 2, జనరల్ మెడిసిన్‌లో 2 పోస్టులతో పాటు సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, మెడికల్ ఆంకాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, ఎండోక్రైనాలజీ, పల్మనాలజీ, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాల్లో ఒక్కొక్క పోస్టు భర్తీ చేస్తున్నారు. మరిన్ని వివరాల కోసం http://dme.ap.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

జీవీఎంసీకి 58 వినతులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ రమణమూర్తి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) తూతూమంత్రంగా సాగింది. కార్యక్రమంలో మేయర్ పీలా శ్రీనివాసరావు పాల్గొనలేదు. అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి 58 వినతులు స్వీకరించారు. జీవీఎంసీ పరిపాలన, ఖాతాల విభాగానికి 7, రెవెన్యూ విభాగానికి 9, ప్రజారోగ్య విభాగానికి 6, పట్టణ ప్రణాళికా విభాగానికి 25, ఇంజినీరింగ్ విభాగానికి 9, మొక్కల విభాగం, యూసీడీ విభాగానికి ఒక్కో ఫిర్యాదు అందింది. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, డీసీఆర్ శ్రీనివాసరావు, ఫైనాన్స్ అడ్వైజర్ మల్లికాంబ, పర్యవేక్షక ఇంజినీర్లతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలేవి? : జీవీఎంసీ 33, 34, 35 వార్డుల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయని, దీని వల్ల పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని ఆయా వార్డులకు చెందిన పలువురు అదనపు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించడమే కాకుండా రోడ్లపై ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయనివ్వడం లేదని.. ఈ విషయాన్ని సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. అధికారులు స్పందించి ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలని కోరారు.

అపరిష్కృతంగా మంచినీటి సమస్య

రైల్వే న్యూకాలనీలో నివాసం ఉంటున్న తనకు మంచినీటి కుళాయి కనెక్షన్ విషయంలో అన్యాయం జరిగిందని గుళ్ల కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. తనది నివాస ప్రాంతమైనప్పటికీ, కమర్షియల్ ట్యాక్స్ విధిస్తున్నారని, 2016-2017 నుంచి ఇప్పటి వరకు అధికారుల చుట్టూ తిరుగుతున్నానని తెలిపారు. కమర్షియల్ నుంచి డొమెస్టిక్‌గా మార్చినప్పటికీ, ఇప్పటివరకు పాత బిల్లును సరిచేయలేదని అదనపు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే జీవీఎంసీలోని అన్ని జోనల్ కార్యాలయాల పరిధిలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

మొక్కలు నాటి సంరక్షించండి


మొక్కలు నాటుతున్న కల్నల్ నీరజ్‌కుమార్

కొమ్మాది: ప్రతి ఒక్కరూ 'తల్లికి వందనం' పేరుతో మొక్కలు నాటి వాటిని జాగ్రత్తగా పెంచాలని ఎన్‌సీసీ 13 బెటాలియన్ ఎల్‌టీ కల్నల్, కమాండింగ్ అధికారి నీరజ్ కుమార్ పిలుపునిచ్చారు. రుషికొండలోని గాయత్రి విద్యా పరిషత్ వద్ద సోమవారం నిర్వహించిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఇక్కడ గ్రీన్ క్లైమేట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పర్యావరణం దెబ్బతినడం వల్ల జరుగుతున్న అనర్థాలను క్యాడెట్లకు వివరించారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే కొంతకాలానికి వర్షాలు లేక తాగడానికి నీరు దొరకని పరిస్థితులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ప్రతి ఒక్కరూ అవకాశం మేరకు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. శిక్షణ పొందుతున్న 600 మంది క్యాడెట్లు ఒక్కొక్కరు కనీసం పది మొక్కలు నాటాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని, ఈ విషయంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, ఎన్‌సీసీ డిప్యూటీ క్యాంప్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్ణిం, సుబేదార్ మేజర్ శ్రీనివాస్, ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ అనంత్ భాస్కర్, కెప్టెన్ కల్యాణ్ అశోక్, కెప్టెన్ ఉమానాగేశ్వరి పాల్గొన్నారు.

జూన్ 10న క్యాన్సర్ తుది విడత ఉచిత వ్యాక్సిన్ శిబిరం

మహారాణిపేట: చైతన్య స్రవంతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రెహమాన్ సహకారంతో జూన్ 10వ తేదీన జర్నలిస్టుల ఆడ పిల్లలకు తుది విడత క్యాన్సర్ నియంత్రణ ఉచిత వ్యాక్సిన్ వేయనున్నట్లు ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోతుమహంతి నారాయణ్, జి. శ్రీనివాస్ తెలిపారు. ఏవీఎన్ కళాశాల ఎదురుగా ఉన్న చైతన్య స్రవంతి కార్యాలయం (కమ్యూనిటీ హాలు) ఆవరణలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరు నెలల క్రితం తొలి విడత వ్యాక్సిన్ వేసుకున్న జర్నలిస్టులకు చెందిన ఆడ పిల్లలు ఈ విడత వ్యాక్సిన్ వేసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు చెందిన పిల్లలు ఆరోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే వ్యాక్సిన్ శిబిరానికి హాజరై తుది విడత వ్యాక్సిన్ వేసుకోవాల్సిందిగా కోరారు. కొత్తవారికి ఈ విడత అవకాశం లేదని స్పష్టం చేశారు.

ఆర్టీసీ బస్సు బీభత్సం

గాయపడిన వ్యక్తి బంగారు ఉంగరాల చోరీ


వాహనాలను ఢీకొన్న ఆర్టీసీ బస్

ఆరిలోవ: విజయనగరం నుంచి కూర్మన్నపాలెం వెళుతున్న ఓ ఆర్టీసీ బస్సు సోమవారం మధ్యాహ్నం హనుమంతవాక కూడలి వద్ద బీభత్సం సృష్టించింది. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగి ఉన్న వాహనాలను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో మూడు కార్లు, ఒక ద్విచక్ర వాహనం పాక్షికంగా దెబ్బతిన్నాయి. ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును, దెబ్బతిన్న ఇతర వాహనాలను రోడ్డు పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. బాధితుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ సబ్బి రాజుపై లా అండ్ ఆర్డర్ పోలీసులు కేసు నమోదు చేశారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఇదిలా ఉండగా ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సంబంధించిన రెండు బంగారు ఉంగరాలు చోరీకి గురయ్యాయి. ఘటనా స్థలంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సింహాచలం ఈవోగా విధుల్లో చేరిన త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవోగా దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ వి.త్రినాథరావు సోమవారం తిరిగి విధుల్లో చేరారు. ఈ ఏడాది మార్చి నుంచి త్రినాథరావు వ్యక్తిగత కారణాలతో 92 రోజులు సెలవు పెట్టిన విషయం తెలిసిందే. నెలాఖరుతో సెలవు గడువు ముగియనుండటంతో తిరిగి విధుల్లో చేరారు. ఇప్పటివరకు దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా విధులు నిర్వర్తించిన దేవదాయశాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత ఆయనకు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం త్రినాథరావు మాట్లాడుతూ వచ్చే నెల 8న సింహగిరిపై జరిగే శ్రీ నృసింహ జయంతిని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఏఈవోలు ఎస్.ఆనంద్‌కుమార్, పిల్లా శ్రీనివాసరావు, సూపరింటెండెంట్‌లు త్రిమూర్తులు, జీవీవీఎస్‌కే ప్రసాద్, కంచి మూర్తి, పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

మావోయిస్టుల మృతదేహాలను అప్పగించాలి

వామపక్షాలు, ప్రజాసంఘాల ప్రతినిధుల డిమాండ్

బీచ్‌రోడ్డు: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాళ్ల కేశవరావుతో పాటు మరో నలుగురు మరణించి ఐదు రోజులైనా, వారి మృతదేహాలను కుటుంబాలకు అప్పగించాలని ఏపీ హైకోర్టు ఆదేశించినా చత్తీస్‌గఢ్, ఏపీ ప్రభుత్వాలు నాటకాలాడుతుండటం దుర్మార్గమని వామపక్ష, ప్రజాసంఘాల ప్రతినిధులు మండిపడ్డారు. వీరి భౌతిక కాయాలను వెంటనే అప్పగించాలని కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు బాధ్యత వహించి భౌతిక కాయాలను రప్పించి, అంతిమ సంస్కారాలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు అనేక తీర్పుల్లో అంతిమ సంస్కారం నిర్వహించుకునే హక్కు కూడా జీవించే హక్కులో భాగమని చెప్పినప్పటికీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వాలు కార్పొరేట్లకు సకల సంపదలను అప్పజెప్పేందుకే ఉన్నాయని, దాన్ని పక్కదారి పట్టించడంలో భాగంగానే ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీలపై, మావోయిస్టులపై హత్యాకాండకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వాలు అమరుల భౌతిక కాయాలను అప్పగించి, ఆపరేషన్ కగార్‌ను నిలిపేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ విశాఖ, విజయనగరం జిల్లాల ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహమాన్, సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు పి.మణి తదితరులు పాల్గొన్నారు.


కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెపై తొలగని ప్రతిష్టంభన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెపై రీజనల్ లేబర్ కమిషనర్(ఆర్ఎల్‌సీ) సమక్షంలో జరిగిన చర్చల్లో ఎటువంటి పురోగతి కనిపించలేదు. అటు కార్మిక సంఘాలు, ఇటు యాజమాన్యం తమ వాదనలకు కట్టుబడి ఉండటంతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. సోమవారం ఆర్ఎల్‌సీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్మిక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ సమ్మె గురించి చర్చించే సమావేశంలో డైరెక్టర్ స్థాయి ఉన్నతాధికారి పాల్గొనకుండా సాధారణ అధికారులు హాజరుకావడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అదే విధంగా ఇప్పటికే తొలగించిన 1,670 మందిని వెంటనే చేర్చుకోవాలన్నారు. ఇకపై తొలగింపులు ఉండకుండా ఆదేశాలు జారీ చేయాలన్నారు. దీనిపై యాజమాన్యం ప్రతినిధులు మాట్లాడుతూ జాతీయ సమ్మె వాయిదా పడినప్పటికీ ఇక్కడ సమ్మె చేయడం చట్టవిరుద్ధమన్నారు. సమ్మె వల్ల ఉత్పత్తికి అంతరాయం కలుగుతోందని చెప్పారు. సమ్మె విరమించుకోవాలని ఆదేశాలు ఇవ్వాలన్నారు. కాంట్రాక్టర్ల అసోసియేషన్ కూడా సమ్మె వల్ల పనికి అంతరాయం కలగడంతో పాటు కార్మిక అశాంతి కలుగుతోందని చెప్పింది. ఈ పరిస్థితుల్లో తదుపరి సమావేశాన్ని ఈ నెల 30కు కమిషనర్ వాయిదా వేశారు. సమావేశంలో యాజమాన్యం నుంచి హెచ్ఆర్ అధికారులు ఎ.అప్పారావు, వై.శంకర్, కార్మిక సంఘాల నుంచి కె.ఎం.శ్రీనివాసరావు, నమ్మి రమణ, ఎం.ఎ.సూర్యనారాయణ, నీరుకొండ రామచంద్రరావు, వంశీ, యు.అప్పారావు, కె.వి.వి.శ్రీనివాసరాజు, కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు బి.అప్పారావు, బి.సన్యాసిరావు, ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పెదగంట్యాడ: మండలంలోని వినాయకనగర్ వుడా కాలనీలో ఓ యువకుడు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలివి. కొత్త గాజువాక, భానోజీకాలనీలో కొయిలాడ రమణాజీ కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఆటోనగర్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కొయిలాడ శ్రీనివాస్ (22) ఉన్నారు. ఐటీఐ మధ్యలో మానేసిన శ్రీనివాస్ తన బావకు చెందిన వినాయకనగర్, వుడా కాలనీలోని ఏసీ, వాషింగ్ మెషీన్ మెకానిక్ షాపులో పని చేస్తున్నాడు. సోమవారం యథావిధిగా శ్రీనివాస్ షాపునకు వచ్చాడు. మధ్యాహ్నం షాపులో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్న భోజన అనంతరం షాపునకు వచ్చిన అతని బావ విగత జీవిగా ఉన్న శ్రీనివాస్‌ను చూసి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి తండ్రి రమణాజీ ఫిర్యాదు మేరకు న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువకుడు ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ప్రధానార్చకుడిగా సీతారామాచార్యులకు పదోన్నతి


సీతారామాచార్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ప్రధానార్చకుడు-2గా కరి సీతారామాచార్యులు పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఉప ప్రధానార్చకులుగా ఉన్న ఆయన పురోహిత్ అలంకారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. స్వామి ఆర్జిత సేవలు, నిత్య సేవలు, ప్రముఖ ఉత్సవాల రోజుల్లో వైదికపరంగా సీతారామాచార్యులు సేవలు కీలకం. స్వామివారి ఉత్సవ మూర్తుల వస్త్రాలంకరణలో ప్రముఖ పాత్ర పోషిస్తారు. పాంచరాత్ర ఆగమ శాస్త్ర పండితుడిగా పేరుప్రఖ్యాతులు గడించారు. ఆయన ప్రధానార్చకుడిగా పదోన్నతి పొందడంతో ఖాళీ అయిన ఉప ప్రధానార్చకుడి పోస్టును త్వరలో భర్తీచేయనున్నారు.

ఉపాధి శిక్షణ తరగతులు ప్రారంభం


శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న సీఈవో ఇంతియాజ్, డీడీ వెంకట కృష్ణ

డాబాగార్డెన్స్: యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ, హైదరాబాద్) ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ద్వారకా బస్టేషన్ కాంప్లెక్స్ సమీపంలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తరగతులు ప్రారంభించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సాలిడ్ వర్క్స్‌లో 30 మందికి, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ విభాగంలో 30 మందికి శిక్షణ తరగతులు ప్రారంభించినట్టు 'స్కిల్' ఇన్‌స్టిట్యూట్ సీఈవో ఇంతియాజ్ అర్షద్, సీఐటీడీ డిప్యూటీ డైరెక్టర్ వెంకట కృష్ణ తెలిపారు. నెల రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని, ఇంజినీరింగ్ డిప్లమో, బీటెక్/ఎంటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అందిస్తామన్నారు. అలాగే స్పెషలైజేషన్‌లో ఇంజినీరింగ్ డిప్లమో, బీటెక్/ఎంటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణ(కోర్సును బట్టి) నెల, మూడు నెలలు, ఆరు నెలలు ఉంటుందని, ఇప్పటికే ఉపాధి పొందుతున్న వారు కూడా వారి నైపుణ్యాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు ఈ అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాన్ని అందించే వ్యక్తులకు తర్ఫీదు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 79950 14167లో లేదా www.sdivisakh.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.